
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 127 వ భాగం

## పురంజనోపాఖ్యానం 20

నారదుడు 'పురంజనుడు' అనే రాజు కథ చెప్తున్నాడు కదా ప్రాచీనబర్హి కి, మొత్తం కథ చూచాయగా అర్ధమైనా అసలు వివరాలు చెప్పమని అడిగితే ఇప్పుడు వివరిస్తున్నాడు. వచనం అర్ధం కావడానికి మెల్లగా చదవాల్సి ఉంటుంది. అవిజ్ఞాతుడు అని చెప్పినది ఈశ్వరుడు – లేదా భగవంతుడు. జీవుడికి రెండు పాదాలతో, నాలుగు పాదాలతో, అనేక పాదాలతో ఉన్న ఒక దేహం విడిచి మరో దేహంలో ప్రవేశం జరుగుతూ ఉంటుంది. కథలో చెప్పినట్టూ చేసుకున్న పుణ్యం బట్టి, నవద్వారాలు కల శరీరం ఏది తనకి కనబడితే అదే మంచిదని తోచి ఇంద్రియాలతో ఆ దేహంలో ప్రవేశించాక సుఖం దుఃఖం అనుభవిస్తూ ఉంటాడు.

వ. అనిన యోగీంద్రుండు రాజేంద్రున కిట్లనియె "నరేంద్ర! యేమి కతంబున నాత్మ చేత నేక ద్వి చతుష్పాదంబును బహుపాదంబును నపాదంబు నగుచుఁ బురంజను దేహంబు ప్రకటం బొనర్చు; నా కతంబున బురంజనుండు పురుషుం డయ్యె; నట్టి పురుషునకు నామ క్రియా గుణంబుల విజ్ఞాయమానుండు గాకుండుటం జేసి యవిజ్ఞాత శబ్దంబునం జెప్పంబడు; సఖుం డీశ్వరుండు; పురుషుండు సాకల్యంబునం జేసి దేహపరిగ్రహంబు చేయ నిశ్చయించు నప్పుడు నవద్వార కలితంబును ద్విహస్త చరణ యుక్తంబును నయిన పురం బేది గల, దది లెస్స యని తలఁచి యప్పురం బను దేహంబునందుఁ బురుషుం డింద్రియంబులం జేసి యే బుద్ధి నధిష్ఠించి విషయంబుల ననుభవించు; నహంకార మమకారంబులకు నే బుద్ధితత్త్వంబు గారణం బగు; నట్టి బుద్ధి ప్రమదోత్తమ యనంబడె; దానికి సఖులు జ్ఞానకర్మకారణంబులైన యింద్రియగుణంబులు; సఖీజనంబులు దదీయ వృత్తులు; పంచముఖోరగం బనం బంచవృత్తి యైన ప్రాణం; బేకాదశ మహాభటులన బృహద్బలుండు నుభయేంద్రియ నాయకుండునైన మనంబు; నవద్వార సమేతంబైన యప్పురంబు చుట్టివచ్చిన పాంచాలదేశంబు లనం బంచవిషయంబులు; నవద్వారంబు లన నక్షి నాసికా కర్ణ ముఖ గుద శిశ్నంబు; లందు నక్షినాసాస్యంబు లైదునుం బ్రాగ్ద్వార పురస్కృ తంబులు; దక్షిణోత్తర కర్ణంబులు దక్షిణోత్తరద్వారంబులు; గుద శిశ్నంబులు పశ్చిమద్వారంబు; లందు నేకస్థల నిర్మితంబులైన ఖద్యోతా విర్ముఖులు

నే(త్రంబులు; వి(భాజితం బన రూపంబు; ద్యుమంతు డనం జక్షురిం(ద్రియంబు; నళినీ నాళిను లన నాసికా ద్వారంబులు; సౌరభం బన గంధం: బవధూత యన ఘ్రూణేం(ద్రియంబు; ముఖ్య యన నాస్యంబు; విపణం బన వాక్కు; రసజ్ఞుం దన రసం; బపణం బన వ్యవహారంబు; బాహూదనం బన వివిధాన్నంబు; పితృహు వన దక్షిణకర్ణంబు; దేవహూ వన నుత్తరకర్ణంబు; చండవేగుం డనం గాలోపలక్షకం బైన సంవత్సరంబు; గంధర్వు లన దివంబులు; గంధర్వీ జనంబు లన రా(త్రులు; పరీవర్తనం బన నాయుర్హరణంబు; గాలకన్యక యన జర; యవనేశ్వరుం డన మృత్యు; వతని సైనికులన నాధివ్యాధులు; (ప్రజ్వారుం డనం (బాణిహింస యందు శ్రీ(ఘ్రవేగంబు గలిగి శీతోష్ణ భేదంబులం ద్వివిధం బైన జ్వరంబు; దక్షిణ పాంచాలం బనం బితృలోక (ప్రాపకంబును (బవృత్తి రూపకంబు నైన శాస్త్రం; బుత్తర పాంచాలం బన దేవలోక (ప్రాపకంబు నివృత్తి సంజ్ఞికంబు నయిన శాస్త్రంబు; (శుతధరుం డన (శో(త్రం; బాసురీ నామకం బనం బశ్చాద్ద్వారంబైన మే(ఢంబు; (గ్రామకం బన సురత సుఖంబు; దుర్మదుం డన గుహ్యేం(ద్రియంబు; నిర్‌ృతి నామకం బైన పశ్చిమద్వారం బన గుదంబు; వైశసం బన నరకంబు; లుబ్ధకుం డనం బాయువు; సంధు లన హస్త పాదంబు; లంతఃపురం బన హృదయంబు; విషూచి యన మనం;" బని వెండియు నిట్లనియె. [4-853]

ఈ వచనంలో నవద్వారాలంటే ఏమిటి, మనసు ఎక్కడ ఉందీ అన్నీ చెప్పాక యవనేశ్వరుడంటే మృత్యువు, ఆయన సైనికులంటే వ్యాధులు. వైశసం అంటే నరకం, అంతఃపురం అంటే మన హృదయం, విషూచి అంటే మనసు. దేహమే తాను అనుకుంటూ జీవితం సాగించాక చనిపోయేసరికి ఏ ఆలోచనతో పోతామో దాన్ని బట్టి మరో జన్మ. ఇలా అనేక జన్మలు గడిచాక ఓ నాటికి ఇది కాదు పద్ధతి, సుఖం అంటే మరోటి ఏదో ఉంది అనేది జ్ఞప్తికి వస్తుంది. అటువంటి పరిస్థితుల్లో నారదుడి వంటి గురువు వచ్చి చెప్తాడు – ముక్తికి ఏమి చేయాలో. ఇక్కడ జరిగేది అదే.

క. పురుషుఁడు నిజ(ప్రకాశతఁ
బరగియు నలఘుఁడుఁ బరుండు భగవంతుండున్
గురుఁడును నగు నయ్యాత్మను
బరువడి నెఱుఁగంగ లేక (ప్రకృతి గుణములన్. [4-856]

నిజానికి అందరం కూడా ఆత్మస్వరూపులమే. కానీ భగవంతుడు, తన క్షేమం ఆకాంక్షించే గురువు అయిన ఆ ఆత్మని మర్చిపోయి (ప్రకృతి మాయలో పడుతున్నాం. ముందు రాబోయే పద్యంలో నారదుడు సున్నితంగా చెప్పినా,

సరిగ్గా సూటిగా తగిలేలా చెప్తున్నాడు, అనేక జన్మల తర్వాత అతి కష్టమైన మానవ జన్మ వచ్చినందుకు పశువులలాగా, కుక్కల్లాగా బతక కూడదు. మంచి పనులు చేస్తూ భగవంతుడికి కైంకర్యం చేయాలి జీవితాన్ని అంటూ.

మ. ఎనయన్ క్షుత్పరిపీడఁ గుంది శునకం బింటింటికిం బోవఁ బూ
నినఁ దద్దైవిక మైన దండహతిఁ గానీ, కాక చౌర్యాన్న మై
నను గానీ తగఁ బొందు చందమున నెన్నన్ దైవయోగంబు పెం
పున నీ జీవుఁడు దాఁ బ్రియాప్రియములం బొందుం ద్రిలోకంబులన్. [4-860]

ఇలా బతకడం ఎటువంటిదో, ఎంత దరిద్రమో కూడా చెప్తున్నాడు. ఆకలితో ఉన్న కుక్క ఇంటింటికీ తిరుగుతూ దెబ్బలు తింటూ, ఛీత్కారాలు ఎదుర్కుంటూ, దొరికినదో, దొంగిలించినదో తింటూ అదే ఆనందం అనుకునే రీతిలో జీవుడు ఏ దేహం వస్తే అందులో ప్రవేశించి ప్రియం అప్రియం అనేవి పొందుతూ ఉంటాడు.

చ. గొనకొని యిట్టి దుఃఖములకుం బ్రతికారము మానవేంద్ర! క
ల్గిన విను తత్ప్రతిక్రియ యకించనవృత్తి జనుండు మస్తకం
బున నిడుమోపు మూఁపునను బూనినఁ దద్భరదుఃఖ మాత్మఁ బా
యని గతి జీవుఁడుం ద్రివిధమై తగు దుఃఖముఁ బాయఁ డెన్నడున్. [4-861]

అయితే ఇటువంటి దుఃఖం తప్పించుకోవడం కుదరదు (చేసుకున్న కర్మ కనక). బరువు మోసేవాడు తల మీదనుంచి భుజం మీదకి బరువు మార్చుకుంటే తాత్కాలికంగా ఉపశమనం కలిగినా బరువు మోయడం తప్పదు కదా? అందువల్ల అవి అనుభవించవల్సినదే.

చ. ఘన పురుషార్థభూత మనఁగాఁ దగు నాత్మకు నే నిమిత్తమై
యొనర ననర్థహేతు వన నూల్కొను సంసృతి సంభవించు న
ట్లనయముఁ దన్నిమిత్త పరిహారక మర్థి జగద్గురుండు నాఁ
దనరిన వాసుదేవ పద తామరసస్ఫుటభక్తి యారయన్. [4-865]

సరిగ్గా గమనించవల్సినదేమంటే – గొప్పదైన ఆత్మ భగవత్స్వరూపం. అయినా దానికి మాయ వల్ల అనర్థాలు కలిగించే సంసారం (జననం మరణం) కలుగుతోంది. ఈ సంసారం తొలగడానికీ, మాయ పోవడానికి నిజమైన దారి జగద్గురుడైన వాసుదేవుడి పాదపద్మాల (పద తామరస) మీద భక్తి ఒకటే. ఆ భక్తి ఎలా ఉండాలి? తనరిన స్ఫుట భక్తి (విస్తారంగా వికసించినది).

ఇది ఒక రోజులో కుదిరేది కాదు (సోమరితనం, ఆకలి వగైరా అనే గుణాల వల్ల). ఇది కలగాలంటే సత్సంగం, సజ్జనులతో సహవాసం, అన్నింటికన్నా భగవత్కృప తప్పనిసరి. అయితే ఒకసారి ఆ భక్తి కలిగితే ఇంక దానికి తిరుగు లేదు, దారిలో పడ్డట్టే.

మ. ఘనవిస్తార మపార మద్వయ మనంగా నొప్పు వేదంబు దా
మనువర్తించుచు మంత్రయుక్తి వివిధంబై నట్టి దేవాఖ్య శో
భనసామర్థ్యముచేత నింద్ర ముఖ రూపం బిష్టదైవంబుగాఁ
గని వేడ్కన్ భజియించు వారలు గనంగా నేర్తురే యీశ్వరున్. [4-874]

ఇంతవరకూ వచ్చినా సరే, విస్తారమైన వేదంలో ఉన్న అనేక మంత్రాలతో ఇంద్రాదులతో సహా అనేక మంది దేవుళ్ళని కొలిచేవారు కూడా పరమేశ్వరుడి ఉనికి కనుక్కోలేరు. ఇదే విషయం మనం మొదట్లో బ్రహ్మ నారదుడికి చెప్పడం చూసాం. ఇక్కడ భగవంతుడు అంటే త్రిగుణాలకి అతీతుడైన, బ్రహ్మ, విష్ణు మహేశ్వరులకంటే అతీతమైన ఆత్మ స్వరూపి అని. ఇదే కృష్ణుడు భగవద్గీతలో చెప్పిన ఆత్మ స్వరూపం – అదిత్యానామహం విష్ణుః, రుద్రాణాం శంకరశ్చాస్మి అనేవి.

వ. కావునం; బ్రాగగ్రంబు లైన దర్భలచేత సకల క్షితిమండలాస్తరణంబు గావించి యహంకార యుక్తుండవు నవినీతుండవు నై పెక్కు పశువులఁ జంపనే కాని కర్మస్వరూపంబును విద్యాస్వరూపంబును నెఱుంగ; వా కర్మ విద్యా స్వరూపంబు లెట్టి వనిన సర్వేశ్వర పరితోషకం బేది యదియ కర్మం; బా సర్వేశ్వరుని యందు నేమిట మతి సంభవించు నదియ విద్య; యతండే దేహులకు నాత్మయు నీశ్వరుండు నగుచుండుఁ గావునఁ బురుషులకు క్షేమకరంబయిన యాశ్రయంబు దత్పాద మూలం; బతండు ప్రియతముండును సేవ్యమానుండును నగుచుండ

నణుమాత్రం బయిన దుఃఖంబు లే; దట్టి యా భగవత్స్వరూపం బెవ్వం డెఱుంగు వాఁడు విద్వాంసుండును గురుండును హరియు" నని చెప్పి వెండియు నిట్లనియె. [4-878]

ఇప్పుడు అసలు విషయం చెప్తున్నాడు. అనేక యజ్ఞాలు చేస్తూ దర్భలు భూమండలం అంతా పరిపించి (అందుకే ఆయన పేరు ప్రాచీన బర్హి అని చెప్పుకున్నాం ముందు వ్యాసాలలో), అనేక పశువులని చంపావు. దీని కర్మఅనుభవించాలి. అయితే నిజమైన కర్మ అనేది ఏమిటంటే – శ్రీహరికి సంతోషం కలిగించేదే కర్మ (సర్వేశ్వర పరితోషకం బేది). ఆయనలో భక్తి కలగడమే విద్య. ఆయనని సేవించడం వల్ల అణు మాత్రమైనా దుఃఖం కలిగే ప్రసక్తి లేదు. ఆ భగవత్స్వరూపం ఎరిగినవాడే విద్వాంసుడు, గురువు, హరి అనబడుతున్నాడు. ఇప్పుడు చేసే కర్మల వల్ల నీకేమీ ఉపయోగం లేదు. ఇదీ నారదుడు చెప్పినది.

ఇప్పటికి కళ్ళు తెరుచుకున్నాయి ప్రాచీనబర్హికి. ఎంతో అదృష్టం ఉంటే తప్ప నారదుడి వంటి గురువు తన ఇంటికి వచ్చి మరీ చెప్పడు కదా ఇటువంటి మంచి విషయాలు.

క. మునివర! భగవంతుండవు
నమపమ విజ్ఞాననిధివి ననఁదగు నీ చే
తను వివరింపంగాఁ దగి
యెనసిన యీ యాత్మతత్త్వ మిటు నాచేతన్. [4-882]

వ. శ్రుతంబును విచారితంబును నయ్యెఁ; గర్మనిష్ఠ లగు నుపాధ్యాయు లైనవార లీ యాత్మతత్త్వంబు నెఱుంగ; రెఱింగిరేని నుపదేశింపరు; కావునఁ దత్కృతంబైన మహాసంశయంబు నీ చేత నివృత్తం బయ్యెఁ; నని వెండియు నిట్లనియె. [4-883]

నువ్వు అనుపమ విజ్ఞాననిధివి, భగవంతుడివి (బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి – అంటే బ్రహ్మన్ని చూసినవారు బ్రహ్మమే అవుతారు కనక వాళ్ళు భగవంతుడి కిందే లెక్క), ఇలా నువ్వు వచ్చి చెప్పడం నా అదృష్టం. అయితే ఇక్కడే ఉన్న నా గురువులలో ఈ ఆత్మతత్వం తెల్సినవారు ఎవరూ లేరు. ఉన్నా నాకు చెప్పరు (ఈయన అడిగితే

కదా?). అయితే ఫలానా జన్మ ఎందుకొస్తోంది, ఈ కర్మ అనుభవించడం ఎప్పుడు అనేవి ఎలా జరుగుతాయి? ఇలా కర్మ అనుభవిస్తూ పోతే ఎప్పటికి మరో జన్మ అనేది లేకుండా ఉంటుంది? ఈ ప్రశ్నలు ఉత్పన్నం అవుతాయి కనక వాటిక్కూడా సమాధానం చెప్పాలి. అవి వచ్చే వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS